క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత



శాయంపేట : మండలంలోని నేరుడుపల్లి గ్రామానికి చెందిన స్వర్గం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యంతో పాటు సరుకులు, ఆర్థికసాయం అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీనియర్ క్లర్క్ బొమ్మకంటి నాగరాజు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్‌బాబు, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు మంగళవారం నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు పీఏసీఎస్ నుంచి రూ.15వేలు తక్షణ ఆర్థికసాయంగా అందించారు. సంఘం డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అశోక్, రమేశ్, మహేందర్‌రెడ్డి, మల్లయ్య, వసంత, సిబ్బంది శంకర్, లింగమూర్తి, పోషాలు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ఐనవోలు : సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు బుధవారం చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి గబ్బెట రాంకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులపై చూపుతున్న మొండి వైఖరిని నిరసిస్తూ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలన్ని సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీలో వరి విత్తనాలు

శాయంపేట : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో 25 క్వింటాళ్ల తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048) రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ గంగాజమున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 కేజీల బస్తాకు రూ. 500 సబ్సిడీ మినహా రూ. 665 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్కు జిరాక్స్‌లను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించి విత్తనాలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

పాఠశాలల యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

కమలాపూర్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. మండల పరిధిలో ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాం, స్టేషనరీని అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబుకు చిల్లు పెడుతున్నారని ఆరోపించారు. వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, ఆయా పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్ యజమానిపై కేసు

దామెర : కాలంచెల్లిన పురుగుమందులు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని ముస్త్యాలపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్త్యాపల్లిలోని లక్ష్మీగణపతి ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి రాకేష్ తనిఖీ చేశారు. కాగా షాపులో కాలంచెల్లిన పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఏఓ ఫిర్యాదు మేరకు పురుగుమందులను స్వాధీనం చేసుకుని షాపు యజమాని బైరి ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పురుగుమందుల విలువ రూ.63,704 ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని షాపు యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఒకరిపై కేసు

ఆత్మకూరు : తన వ్యవసాయ భూమి ఒడ్డుపై ఉన్న చెట్టును తొలగిస్తుండగా అడ్డుకున్నందుకు తనను బురదలో నెట్టేసి దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని నీరుకుళ్లకు చెందిన అర్షం సారయ్య మంగళవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన ఉడుత రాజు తన వ్యవసాయ భూమి ఒడ్డుపై ఉన్న చెట్టును తొలగిస్తున్నాడని, ఆ క్రమంలో తాను వెళ్లి అడ్డుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో రాజు తనను కులం పేరుతో దూషిస్తూ గొడ్డలితో బెదిరించాడని బురదలో నెట్టేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి వెల్లడించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- డీఆర్డీఓ శ్రీను
- ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో సంబురాలు చేసుకుంటున్న మహిళ సంఘం సభ్యులు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న మేన శ్రీను



దామెర : మహిళను సన్మానిస్తున్న డీపీఎం అనిత

ధర్మసాగర్ : రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు డీఆర్డీఓ మేన శ్రీను స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 07వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లాలోని మహిళలను భాగస్వాములు చేయాలని ఉద్దేశంతో మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం వీఓస్థాయి, గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంబురాల్లో ప్రతి మహిళా పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. మహిళా సంఘాలకు బస్సులు కేటాయించగా హనుమకొండ జిల్లాకు ఐదు బస్సులు మంజూరు అయ్యాయని, అందులో ఒకటి ధర్మసాగర్ మండలానికి కేటాయించినట్లు చెప్పారు. మండలంలో సోలార్ పవర్ ప్రాజెక్టును నాలుగు ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఏపీఎం అనిత, మహిళా సంఘాల నాయకురాళ్లు, మహిళలు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీపీఎం అనిత సూచించారు. మండల కేంద్రంలోని స్వర్ణతెలంగాణ మండల సమాఖ్యలో మంగళవారం ఇందిర మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. సమాఖ్యలో ప్రతిభ కనబర్చిన వీఓలను, సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. వడ్డీలేని రుణాలు అందజేసి మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్‌బంక్‌ల నిర్వహణ, చేపలు, కోళ్ల పెంపకం, డెయిరీ నిర్వహణలో మహిళలను భాగస్వాములను చేసి ప్రతి మహిళ ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా కృషి చేస్తోందని అన్నారు. ఈ అవకాశాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళ సంఘం సభ్యులను సన్మానించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఏపీఎం ఝాన్సీ, అధ్యక్షురాలు ఇంద్రజ, సభ్యులు శ్రీదేవి, రజిత పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రంలోని భరతమాత మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, సంఘంలో ఉన్న సభ్యురాళ్లు ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా వర్తింపజేస్తుందన్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీ, కోలాటం తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళా సంఘం సభ్యురాళ్లు పాల్గొన్నారు.

‘సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలి’



మాట్లాడుతున్న తిరుపతి

కమలాపూర్ : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించి, ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి, మాదన్నపేట, శనిగరం, మర్రిపల్లిగూడెం, గుండేడు, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులతో మంగళవారం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ యాజమాన్యాల కింద కొనసాగుతున్న పాఠశాలలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బత్తిని శ్రీరామాంజనేయులు, మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, రమేశ్, భిక్షపతి, శ్రీనివాస్, శ్రీరాములు, ప్రసాద్, భద్రయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ధర్మసాగర్ : కేక్ కట్‌చేస్తున్న నాయకులు

ధర్మసాగర్ / వేలేరు / ఐనవోలు : ధర్మసాగర్ మండల కేంద్రంతో పాటు ఐనవోలు మండలంలోని గర్మిళ్లపల్లి, వేలేరు మండల కేంద్రంలో మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు.

‘కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదు’

నెక్కొండ : పెన్షన్ పెంపును, కరువుభత్యాన్ని నిలిపివేస్తే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు గటిక మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పెన్షనర్ల హక్కులకు భంగం కలిగిస్తోందని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంపు, కరువు భత్యం ఎప్పటిలాగే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వడ్డె లక్ష్మీనారాయణ, నాయకులు ఇనుగాల ఉపేందర్‌రెడ్డి, ఈదునూరి యాకయ్య, పాగాకుల సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్సార్

- కొనియాడిన కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు
- జిల్లా వ్యాప్తంగా మహానేత జయంతి



ఆత్మకూరు : వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరకాల : పేద ప్రజల సంక్షేమానికి పథకాలను సృష్టించి వారి అభ్యున్నతికి పాటుపడిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గోనాథ్, సంపత్‌కుమార్, శ్రీను, రాఘవరెడ్డి, జాఫర్‌రిజ్వీ, శ్రీశైలం, భాస్కర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం దివంగత మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వాసు, కిరీటి, మాజీ సర్పంచ్‌లు రాజు, సామెల్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ జయ్‌పాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, శివారెడ్డి పాల్గొన్నారు.

ఐనవోలు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహ్మద్ రఫీ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రతాప్, యూత్ కాంగ్రెస్ మండల జనరల్ సెక్రటరి భరత్, ప్రశాంత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు కొనియాడారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు వైద్య సదుపాయం కల్పించిన మహోన్నతమైన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అన్నారు. 108, బ్యాంకు రుణాలు, రైతులకు రుణమాఫీ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం తదితర సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. నాయకులు సంతాజీ, స్వామి, అర్జున్, వెంకట్, వినయ్, ప్రమోద్, బాలుస్వామి పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో..

ధర్మసాగర్ : మండలంలోని ధర్మపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టేకుమట్ల విష్ణు ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్‌లు రవయ్య, యాకుబ్, నాయకులు దయాకర్, దివాకర్, రాజు, అనిల్, వెంకటస్వామి, అనిల్, రాజు, జంజీర్ పాషా, సుమన్, సురేందర్ రెడ్డి, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కరుణాపురంలో 46వ డివిజన్ రాంపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా కరుణాపురంలోని అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బహుజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్, నాయకుడు అల్లె అర్జున్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో పండ్లు పంపిణీ చేశారు.



పరకాలలో..



ధర్మసాగర్‌లో..



ఐనవోలు : కేక్ తినిపిస్తున్న నాయకులు

ఇందిరమ్మ లబ్ధిదారులకు‘మహిళా’ రుణాలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

నడికూడ : ఇందిరమ్మ ఇళ్లు మంజూరై మహిళా సంఘంలో సభ్యత్వం కలిగిన లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ అవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటారు. అనంతరం గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఇందిరమ్మ కమిటీ, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అర్హులకు ప్రాధాన్యత ఇస్తూ ఇందిరమ్మ ఇళ్లను దశల వారీగా మంజూరు చేస్తామని అన్నారు. పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నెరవేరుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. నేరుగా లబ్ధిదారుడికి చెందే విధంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ విమల, అధికారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులతో పాటు స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఓటరు జాబితా తయారీపై శిక్షణ



ధర్మసాగర్ : శిక్షణలో పాల్గొన్న బీఎల్‌ఓలు



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న తహసీల్దార్ జగత్‌సింగ్

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటరు జాబితా నిర్వహణపై మంగళవారం బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) శిక్షణా నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్స్ బండ రమేశ్, రాజేందర్ బూత్‌స్థాయి అధికారులకు ఓటర్ జాబితా నవీకరణ, నమోదులో పాటించాల్సిన జాగ్రత్తలు, తప్పుడు నమోదుల తొలగింపు, ఓటర్ల వివరాల నమోదు వంటి అంశాలపై శిక్షణ కల్పించారు. బీఎల్‌ఓల కోసం ఒక ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని బూత్ లెవెల్ అధికారులు ఈ శిక్షణా తరగతుల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకన్న హాజరై శిక్షణా తరగతులను పర్యవేక్షించగా, తహసీల్దార్ సదానందం, నాయబ్ తహసీల్దార్ సంతోష్, మండల గిర్దావర్లు స్పందన, అనిత, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : బీఎల్‌ఓలు ఓటరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్లు జగత్‌సింగ్, రాజేష్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం బీఎల్‌ఓలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఓటరు జాబితా తయారీ విధానం, ఎన్నికల నియామావళిపై బీఎల్‌ఓలు అవగాహన కలిగి ఉండాలన్నారు. రెవెన్యూ సిబ్బంది. ట్రైనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఓటర్ అఫ్లేషన్ తప్పనిసరిగా చేయాలని ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, జమ్మికుంట తహసీల్దార్లు కనుకయ్య, వెంకట్‌రెడ్డి, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మండల కన్వీనర్ తంపుల మోహన్

ఐనవోలు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో మామిళ్ల సంపత్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పుడూ జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రాజు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు, గ్రామ ఇన్‌చార్జ్ కట్కూరి రాజు, నాయకులు రాజారపు రాజు, పల్లకొండ సురేష్, రాఘవులు, నందనం సొసైటీ డైరక్టర్ కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

టీజీబీ ఖాతా పొందితే ప్రయోజనాలు

- బ్యాంకు మేనేజర్ వాజీదా

ధర్మసాగర్ : తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా పొంది అనేక ప్రయోజనాలు పొందాలని బ్యాంక్ అధికారులు తెలిపారు. మండలంలోని దేవునూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో జన సురక్ష పథకాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడారు. గ్రామంలో ప్రతిఒక్కరూ టీజీబీలో ఖాతా పొందాలని, పీఎంజేడీ అకౌంట్ గురించి వివరించారు. అదే విధంగా 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల్లోపు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పొందాలని తద్వారా సహజ మరణానికి రూ.2 లక్షలు బీమా అందించనున్నట్లు చెప్పారు. సురక్ష బీమా యోజన 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల్లోపు వారు పొందొచ్చని, ఖాతాదారుడు ప్రమాదంలో మరణిస్తే రూ.2 లక్షల బీమా వస్తుందని తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల్లోపు వారికి అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 సంవత్సరాల తర్వాత నెలవారీగా రూ.1000 నుంచి రూ.5000 వస్తుందన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం జీవనజ్యోతి బీమా పొంది మరణించిన వారి నామినీకి రూ. 2లక్షల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వాజీదా, ఎఫ్ఎల్సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, వేలేరు సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్, గ్రామ ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

కమలాపూర్ : శాసనమండలి సభ్యుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను కమలాపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా అభినందనలు తెలిపారు. మండలంలో పార్టీ పరిస్థితి, కార్యకర్తల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చరణ్‌పటేల్, ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, సుమారు 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ వెంకట్‌తో కాంగ్రెస్ నాయకులు

రేపు ప్రత్యేక పూజలు

నల్లబెల్లి : రేపు (ఈనెల 10న) మండలంలోని మేడపల్లి, రాంపూర్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు శివశక్తి పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాంబరాజు ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.25 గంటలకు పూజలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.